కళ్యాణ కింకిణి

మధురాంతకం రాజారాం



అత్యవసరంగా అయిదు రత్నాలు కావాలి!

పేరుకు రత్నగర్భే అయినా మా ఇంటి పెరట్లో నేల త్రవ్వితే రత్నాలు దొరకవు. రత్నాలు రాసులుగాపోసి, వీధుల్లో అమ్మే కాలాలుగావు. ఇంతకూ మూల్యం చెల్లించుకుంటే దొరికే రత్నాలు కావు. కావలిసినవి! అమూల్యమైన రత్నాలు.

క్షరం కాని అక్షరాల రూపంలో నాలుగు కాలాలపాటు నిశ్చలంగా నిలిచి ఉండగల పద్య రత్నాలు!

చొక్కా తీసి వంకీకి తగిలిస్తుండగా టేబిలు పైన కవరు కనిపించింది. పసుపునీటి చిలకరింపుల్లో తడిసిన కవరు. కనిపించగానే స్ఫురించింది. ఎవరికో పెళ్ళి!

ఇహలోక యాత్రలో వధూవరుల కలయికకు వివాహ మహోత్సవమన్న తతంగం స్థూల శరీరంలాంటిదైతే — పెళ్ళి పత్రికే సూక్ష్మ శరీరం. వివాహాల్లో రాక్షస గాంధర్వాది విభేదాలున్నట్టే పెళ్ళి పత్రికల్లో సైతం ఆకారాన్నిబట్టే, అంతర్యాన్నిబట్టీ అనంతమైన వైవిధ్యం కద్దు! కేవలం తెలియజేసేందుకు మాత్రమే వచ్చేవి కొన్ని! (ఇవి పెళ్ళి జరిగిపోయిన తర్వాత వచ్చినా రావచ్చు!) శుభ ముహూర్తం రేపో మాపో ననగా రెండు మూడు వందల మైళ్ళ దూరం నుంచి ఈ పెళ్ళికి నువ్వు రాలేవులే అని వెక్కిరించినట్టుగా వచ్చేవి కొన్ని! కేవలం శుభా కాంక్షల్ని మాత్రమే ఆశించి వచ్చేవి కొన్ని! వాటిలో మనసుకు ముకుదాడువేసి, మమతలకు రెక్కలు తొడిగి పెళ్ళికి తరలించే పెళ్ళి పత్రికలు ఎన్ని?

కవరులోనుంచి పత్రికను పైకి తీశాను. మడత విప్పేసరికి పెద్దక్షరాలలో వరుడిపేరు దృగ్గోచరమైంది. ఒడలికి రోమాంచాన్ని, మనసుకు తన్మయత్వాన్ని కలిగించే అనుభవాన్ని ఎలా వర్ణించి చెప్పగలం! కాదంటే వసంత కాలంలో ప్రభాత సమయాన గది కిటికీలోనుంచీ, అల్ల నల్లన లోపలికి వచ్చిన మల్లికా సౌరభం శరీరాన్ని అభిషేకించినప్పుడు కలిగే అనుభూతితో ఉపమించవచ్చునేమో! పెళ్ళి ఎవరికో కాదు! మా నాగరాజుకి!

తీయటి ఊహకు, నిజమైన కలకు పర్యాయపదం చెప్పమంటే చప్పున చెప్పవచ్చు—నాగరాజు పెళ్ళి!

తన నీడను తన క్రిందనే దాచుకుని పరిసరా

ల్లోకి వెలుగుల్ని వెదజల్లడం దీప శిఖ స్వభావం. తన కష్టాలను తాను కిమ్మనకుండా భరించి, కించిత్తు ఆనందం కలిగినా దాన్ని లోకులకు వంచిపెట్టేవాడు నాగరాజు. నాగరాజుకు పెళ్ళంటే సంతోషించేవాళ్ళు అసంఖ్యాకులు!

"ఇదిగో శకుంతలా! నాగరాజుకు పెళ్ళట!" అంటూ వంట గదివైపు పరుగు దీశాను.

"అలాగా! అదేనా పెళ్ళి పత్రిక!" అంటూ ఎదుర్కోలు వచ్చేసింది శకుంతల. "పోస్ట్‌మేన్ తెచ్చి ఇచ్చాడు. ఈ చంటిపిల్ల తెరిచి చూడనిస్తుందిగనుకనా! అలాగైతే నాగరాజుకు పెళ్ళన్నమాట! అబ్బ, అబ్బ ఎంత కాలానికి! ఎక్కడండీ ఎప్పుడు?"

ఆ వివరాల కోసం మళ్ళీ ఆహ్వాన పత్రికనే పరామర్శించవలసి వచ్చింది. ఎక్కడ—అన్న ప్రశ్నకు లభించిన సమాధానంలో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు వచ్చిన చిక్కల్లా 'ఎప్పుడు' దగ్గరే వచ్చింది. నాగరాజుపైన ఒక్కింత కోపం కలిగిన మాట గూడా నిజం! ముహూర్తం రేపటి ఉదయాన్ననగా ఈరోజు మధ్యాహ్నమూ నా కాహ్వానమందడం!

ఎందుకైనా మంచిదని కవరుపైని పోస్టాఫీసు ముద్రల్ని పరిశీలించి చూచాను తొందరపడి నాగరాజును అపార్థం చేసుకున్నందుకు నాకు నేనే కించపడవలసి వచ్చింది ఆ కవరును 'పోస్టు చేయడమైతే వారం రోజుల క్రిందటే జరిగింది. అది కులాసాగా కొంత భూప్రదక్షిణం గావించి — ఇలా నింపాదిగా గమ్యస్థానం చేరుకుంది!

వంకీకి తగిలించిన చొక్కా తీసి మళ్ళీ తొడుకుంటున్నాను.

"అదేమిటండీ! భోజనాల వేళప్పుడు మళ్ళీ ఎక్కడికి ప్రయాణం? సరే సరే వెళ్ళిరండి. నాగరాజుకు పెళ్ళని తెలిసింది గదా! మీకింక ఆకలెక్కడుంటుంది?"

మా ఆవిడ అభిప్రాయమైనా, బొత్తిగా కొట్టి పారవేయడానికి వీల్లేనిది! ఆకలిని మరపించే మంచి లక్షణం శుభవార్తకున్న మాట నిజమే!

బయల్దేరిన వేళా విశేషం గూడా మంచిది! వెళ్ళిన సమయానికి సచ్చిదానందంగారు ఇంటి దగ్గరే ఉన్నారు.

ఉన్నారేగానీ, ఆయన ఈ లోకంలో ఉన్నట్టు లేరు. వాలు కుర్చీలో పడుకుని కాళ్ళు బారగిల చాపేశారు. కుర్చీపైనుంచీ చేతుల్ని క్రిందికి దిగవిడిచేశారు సులోచనాల క్రింద కళ్ళు గట్టిగా మూసుకున్నారు అది నిద్రో, ఆలోచనో, విచారమో కాక మరేమిటో అంతు పట్టడంలేదు.

గుమ్మం దగ్గర నిల్చుని లోపలికి తొంగి చూచాను. ఆ హాల్లోని దృశ్యం కంటబడిన తర్వాత సచ్చిదానందంగారి వాలకానికి వ్యాఖ్యానం—వేరొకరు విడమరిచి చెప్పనవసరం లేకుండా తనంతటదే బోధపడింది

ఓ పదేళ్ళ అమ్మాయి మంచంపైన పడుకుని వుంది టేబిలుపైన మందు సీసాలు, మంచంకోడు కానుకుని ఖిన్నురాలై కూర్చున్న తల్లి ఆమె ఒడిలో (బహుశా ఏడ్చి ఏడ్చీ సొమ్మసిల్లి పోయిందేమో) పసిపాప నిద్రపోతోంది అప్పుడే బడిమంచీ వచ్చినట్టున్న పిల్లలిద్దరు తమ కంచాల్లోకి అన్నం వస్తుందో రాదో నన్న సందేహంతోనే గావచ్చు అవతలి వైపు వాకిలికి కాపలా కాస్తున్నారు.

వచ్చిన పని సంగతి దేవుడెరుగుగానీ, అక్కడ నిల్చోడానికైనా కాళ్ళాడటం లేదు. గిరుక్కున వెనుదిరికి వచ్చేయాలనే అనుకున్నాను. అంతలో ఏదో అంతర్వాణి చెప్పినట్టుగా సచ్చిదానందంగారు కళ్ళు తెరిచేశారు.

"ఏమిటయ్యా రాజశేఖరం! ఎంతసేపైంది వచ్చి! నిల్చున్నావెందుకు? కూర్చో నాయనా, అలా అరుగుపైన కూర్చో......"

"ఏమిటండీ మేష్టారుగారూ! అమ్మాయికేదైనా జబ్బా?"—కూర్చుంటూ ప్రశ్నించాను. అది వెర్రి బాగుల పిచ్చి ప్రశ్న అన్న విషయం నా మట్టుకు నాకే తెలిసిపోతోంది.

"జబ్బా, జబ్బున్నరా! మెల్లగా అడుగుతున్నావా రాజశేఖరం! అదేం మాయదారి జ్వరమోగానీ వారం రోజులనుంచీ ఇంటిల్లిపాదికీ వూపిరి సలప నివ్వడంలేదు. పేదవాళ్ళ కొచ్చిన జబ్బయ్యా బాబూ! దీనిపైన సూర్యుల్లా ఆర్యుల్లా వెచ్చించమనడం భావ్యం కాదు. అంటే డాక్టర్లు ఒప్పుకోరు. అప్పటి నేనేదో ముల్లెను ముసుగులో దాచుకుని అమ్మాయికి సరైన చికిత్స చేయించడం లేదని ఇంటావిడ మొత్తికోలు. ఉదయం నిద్రలేచి బయటికి వచ్చే సరికి ఈ అరుగుపైన ప్రత్యక్షమయ్యేవాడు ఇంటి కామందు. అతగాడికి వరుసగా మూడు మాసాల ఇంటద్దె బకాయి. పాలావిడ ఎన్నడో పాలు పోయటం మానేసింది. రోజుకొక్క శేరు పాలు లేకపోతే ఇల్లు గడవదు. స్కూలుకు ఏ దారంట వెళ్ళడమనేది అనుదినమూ నా కెదురయ్యే ధర్మ సంకటం! రోడ్డుపైన వెళ్తే బట్టలకొట్టు ఆసామి. వీధిపైన వెళ్తే చిల్లరంగడివాడు. సందు దారి పడ్తే వడ్డీ కంపెనీ వాళ్ళు. ఈ బాధలన్నీ పడలేక ఎక్కడికైనా పారిపోగలిగితే బాగుండు ననిపిస్తోందనుకో రాజశేఖరం! పులి మీద పుట్రలా ఈ హెడ్మాస్టరొకడు నాకు! చచ్చినా ఒక రోజు సెలవివ్వడు......"

సచ్చిదానందంగారి దురవస్థల జాబితాను మననం చేసుకుంటూ ఇంటిదారి పట్టడం వినా గత్యంతరం తోచిందిగాదు. "పోనీలెండి మేష్టరు గారూ! కష్టాలు మనుషులకు గాక మాన్లకు వస్తాయా? వస్తే వస్తాయి. ఏం చేస్తాయి. అవే వెళ్తాయి" అంటూ మానవ జాతికి పారంపర్యంగా సంక్రమిస్తున్న ఓదార్పు మాటల్ని వల్లించి లేవడానికి ఉద్యుక్తుడి నయ్యాడు.

కానీ, సచ్చిదానందంగారు ఆ పని చేయడానికి వీలిచ్చారుకారు-

"కూర్చోవయ్యా రాజశేఖరం! ఇంతకూ ఏం పనిమీద వచ్చావో చెప్పావుకావు......"

"అబ్బే, ఈ పరిస్థితిలో మిమ్మల్ని చూచిన తర్వాత చెప్పడానికి నోరెలా వస్తుందండీ మేష్టరు గారూ! నా పని కేముంది? ఏదో ఉబలాటం కొద్దీ వచ్చాను మరి మీరు సెలవిప్పిస్తే......"

"చూడు రాజశేఖరం! చల్లకొచ్చి ముంత దాచడ మెందుకు? నా కోసం ఎవరు వచ్చినా అప్పులు వసూలు చేసుక పోవడానికే వస్తారు. నువ్వొక్కడివి ఏదో పని బడి వచ్చానంటున్నావు అంతకంటే ఏం కావాలి నాకు! ఆ పనేమిటో చెప్పరాదూ!"

"మరేం లేదు. మరి......వీలుంటే మీచేత పద్యాలు వ్రాయించుక పోదామని వచ్చాను......"

"అది గదీ! అలా చెప్పాలయ్యా రాజశేఖరం! యూనివర్శిటీ పరీక్ష లెందుకు? ఇప్పుడు గనుక నేను పద్యాలు వ్రాయ గలిగితే అష్టావధాన శతావధానాలు చేసేవాళ్ళు నాముందు బలాదూరు......"

సులోచనాలుతీసి తొడుక్కున్న చొక్కా గుడ్డతోనే కళ్ళు తుడుచుకుంటూ కొనసాగించారు. సచ్చిదానందంగారు—"ఈ కవిత్వం వ్రాయాలన్న ఉబలాట ముందే, దీనంత మొండిది ఇదే ననుకో రాజశేఖరం! కానీ ఎడారిలో వూట బావులు పడవు గదా! ఏవో పద్యాలు కావాలని వచ్చావు. మంచిదే. కానైతే నాకు నిరుపహతి స్థలాలు చూపించ గలవా నువ్వు! పోనీ రమణీ ప్రియ దూతికలచేత కప్పురపు విడా లిప్పించగలవా! ఆత్మ కింపయిన భోజనం పెట్టించగలవా! పోనీ ఇవేవీ లేకపోతే మానె— ఓ పది రూపాయలు అప్పివ్వగలవా రాజశేఖరం! వద్దులే నాయనా వద్దు. ఉన్న అప్పుల వాళ్ళే చాలు. నీబోటి వాళ్ళు గూడా వాళ్ళతో కలిసి పోతే ఇక నన్ను వూళ్ళో ఆప్యాయంగా పలకరించే వాళ్ళుండరు—"

బయట మండు టెండలు కాస్తున్న ఆ మిట్ట మధ్యాహ్న వేళ సచ్చిదానందంగారి కళ్ళు చెమ్మగిల్లడం చూచాను.

సచ్చిదానందంగారు వెళ్ళి రమ్మని చెప్పకపోయినా సెలవు పుచ్చుకోడ మొక్కటే ఇక తరువాయి. లేచి రెండడుగులు వేశాను గూడా!

"ఇంతకూ పద్యాలు ఎందుకో, ఎవరి కోసమో చెప్పావుగావు......"

"ఎందుకైతేనేంలెండి మేష్టరుగారూ! ఎంతగా వద్దనుకున్నా, అప్పుడప్పుడు ఇల్లాంటి గొడవలు మీ కెదురవుతూ ఉంటాయి. మనసు బాగుంటే ఇది మీకు పెద్ద పనేమీగాదు ఓ మిత్రుడికి పెళ్ళి. బహుశా మీకూ తెలిసే ఉంటుంది నాగరాజని......"

సచ్చిదానందంగారు తటాలున లేచి నిల్చున్నారు. "ఉండుండు రాజశేఖరం! హరి నా మతి మరపు కూలా! ఎంత పొరబాటు జరిగిపోయిందో చూచావా!' గబ గబా లోపలికివెళ్ళి ఆయన తోలు సంచీ తీసుకొచ్చారు.

"పది రోజు లప్పుడు పట్టణంలో కనిపించాడు నాగరాజు. పెళ్ళి పత్రిక ఇచ్చి, తప్పకుండా రావాలని మరి మరీ కోరాడు. బస్సులో వస్తూ, వస్తూ పద్యాలల్లేశాను. నే నల్లడ మేమిటి? పోతన్నగారు భాగవతాన్ని వ్రాశాడంటావా రాజశేఖరం! రామచంద్రుడే పలికించాడు. నాగరాజు పైన నాకున్న వాత్సల్యమే నాచేత పద్యాలు పలికించింది ఏదీ ఎక్కడుందది...."

సంచీలోనుంచి ఓ కాగితం పైకి తీశారు సచ్చిదానందంగారు.

"రాగ భరిత మనస్కుడు నాగరాజ
ప్రథిత గుణ గణ విభవాభి రామ—రాధ
పూవు తావియు చేరి పెంపొంది నట్లు
అలరు గావుత ఈ గృహస్థాశ్రమమ్ము.

ఇంతకంటె నెనివ్వ గలిగిన శుభా శీస్సు లేమున్నాయి రాజశేఖరం! ఏదో వ్రాశానుగానీ, నా ఇబ్బందుల్లో సర్వమూ మరచిపోయాను. తీసుకెళ్ళు నాయనా తీసుకెళ్ళు ....."

కాగితాన్ని జేబులో ఉంచుకుని రోడ్డు పైకి వచ్చానో లేదో సచ్చిదానందంగారు మళ్ళీ పిలిచారు. పిలుస్తూ మెట్లు దిగి దగ్గరికే వచ్చేశారు.

"చూడు రాజశేఖరం! నాగరాజుకు పెళ్ళంటే

—65 వ పేజీ చూడండి

కల్యాణ కింకిణి

37— పేజీ తరువాయి

నా ప్రాణాలన్నీ అక్కడే ఉంటాయి. వాడు నాకు శిష్యుడు. నాకు పెళ్లై పదిహేనేళ్ళు కావస్తున్నాయి. అప్పటికి నాగరాజు పన్నెండేళ్ళయినా నిండని కుర్ర కుంక. సెకండ్ ఫారం కాబోలు చదువు కుంటున్నాడు. పెళ్లి పందిరిలో తారాడుతుంటే వినోదం చూచిపోవడానికి వచ్చాడేమో ననుకున్నాను దివి దేవావసు—వివాహ ముహూర్త కాలమందు పెళ్ళి కుమారుడికి నాగరాజు చదివించింది నీలి రంగు ఓ ఫౌంటెన్ పేనా అన్నాడు పురోహితుడు ఇదిగో అదే ఈ కలం! నాటికీ నేటికీ అలాగేవుంది దీనితో ఎన్ని పుస్తకాలు వ్రాశాను. ఎన్నిసార్లు జీతం తీసుకుంటూ, రివిన్యూ స్టాంపులమీద సంతకాలు చేశాను... ..''

ఈసారి సచ్చిదానందంగారి కళ్ళల్లో ఆనంద బాష్పాలను చూచాను.

* * *

జరుగుతున్నది పెళ్ళిళ్ళ సీజను. రోడ్డులో బస్సులు దొరుకుతాయన్న పూచీ చాలా తక్కువ. సాయంత్రం వరకూ బడిగాపులు పడిన తర్వాత అదృష్టంకొద్దీ ఓ బస్సులో సీటు దొరికింది.

పరుగెడుతున్న బస్సు ఆలోచనా ప్రపంచంలో విహరించడానికి అనువైన చోటు. నా ఆలోచనలన్నీ నాగరాజు జీవితాకాశంలో పతంగాల్లా విహరిస్తున్నాయి.

నాగరాజు సంపన్న కుటుంబంలో పుట్టాడు. కానీ, కేవలం సంపదనే తులామానంగా తీసుకుని తోడి వారితో సంబంధాలు నెలకొల్పుకునే మానవతా దారిద్ర్యానికి అతడు దూరంగా పెరిగాడు. వెయ్యి గ్రంథాలు సమకూర్చి వాటిని, చదువుకుంటూ ఎడారిలో కూర్చోమంటే కూర్చోడం తన చేత గాదనీ, మూర్ఖులైనా, క్రూరులైనా, మరెలాంటి వారైనా మానవులతో సాహచర్యమే తనకు కావలి సిందనీ ఓ కవి వ్రాక్కుచ్చాడు. కవులు సృష్టించే కథల్లో కావ్యాల్లో మాత్రమేగాదు—భగవంతుని సృష్టికే మకుటాయమానమైనవాడు మానవుడు ఈ విలువను వుగ్గుబాలతోనే ఒంట బట్టించుకున్న వాడిలా కనిపిస్తాడు నాగరాజు.

మార్గమధ్యంలో ఎక్కడైనా నాగరాజు తారసిల్లితే—ఇక ముందుకు సాగడం రెండు మూడు గంటలపాటు వాయిదా పడినట్టే! ''ఏమండీ! రాజశేఖరంగారూ! ఎప్పుడొచ్చారు వూరినుంచి! వదినగారు బాగున్నారా! పాపాయికి మాటలొచ్చాయా! రండి రండి అలా హోటల్లోకి వెళ్ళి కూర్చుందాం'' అంటాడు నాగరాజు.

హోటలు వైపు వెళ్తుండగా మళ్ళీ కబుర్ల పరంపర ప్రారంభం.

''మన కృష్ణమూర్తికి ప్రమోషన్ వొచ్చింది తెలుసా మీకు! గొప్పగా పార్టీ ఇచ్చాడు. చీటీ వ్రాసి మీకు బస్సులో పంపుదామనుకున్నాం. బస్‌స్టాండులోకి వచ్చేసరికి బస్సు వెళ్ళిపోయింది ..''

ఓహో అలాగా — అనడానికైనా తెరపినివ్వడు నాగరాజు.

''అన్నట్టు ఈ రోజు గోపాలం రేడియోలో పాడుతున్నాడండీ రాజశేఖరంగారూ! ఇవాళ ఇక్కడే వుంటారుగదూ! తప్పకుండా వినాలి మనం! ...''

రేడియో గాయకుణ్ణి గురించి ప్రస్తావించాడా



ఊహూ హాఁ హాఁ

ఒక టీ చెంచాడు వుడ్‌వార్డ్స్ 'గ్రైప్‌వాటర్' ఇస్తేచాలు మీ శిశువు ఏడుపు మాని...సుఖంగా నిద్రించును !

శిశువుల జబ్బులు – వాయువువల్ల కడుపు ఉబ్బరం, పళ్లు చేయునప్పుడు జబ్బులకు, వుడ్‌వార్డ్స్ మాత్రమే సమకూర్చగల నివారణ కావలెను. వంద ఏళ్లకు మించి తల్లులు వుడ్‌వార్డ్స్ వాడుచూ శిశువులను పుష్టి కరంగా పెంచియున్నారు.

వుడ్‌వార్డ్స
'గ్రైప్ వాటర్'

ప్రపంచమంతటా 100 ఏళ్లనుంచి వాడబడుచున్నది.



అధికారయుత ఏజెంట్లు: హెర్బర్ట్స్ సన్స్ లిమిటెడ్., బొంబాయి. కలకత్తా మరియు లక్నో • టి.టి కృష్ణమాచారి అండ్ కొ., మద్రాస్ • ఎమ్.జి. షహాని అండ్ కొ., (ఢిల్లీ) ప్రైవేట్ లిమిటెడ్, ఢిల్లీ.

Aiyars AT 341-TL

కల్యాణ కింకిణి

అంతలో హోటలు సర్వరు ఆవైపోస్తే అతడి నైనా పలకరించకుండా వదిలి పెట్టడు నాగరాజు—
"ఏమిటోయ్ అరుణాచలం! రాత్రి సెకండ్ షో మత్తు ఇంకా వదల్లేదేమిటి? పగటివేళ హోటల్లో ఇలా కనిపిస్తాడు గదండీ రాజశేఖరంగారూ! రాత్రి తొమ్మిది గంటలకు శుభ్రంగా స్నానం చేసి, తెల్లగా డ్రెస్ చేసుకుని వీధంట వెళ్తుంటే పిల్ల జమీందారులా ఉంటాడు. చూడ్డాని కింకా పాతికేళ్ళయినా వచ్చినట్టు లేదు గానీండీ, అరుణాచలాని కప్పుడే నాలుగో తరగతి చదువుకుంటున్న కూతురుంది. స్కూలునుంచి ప్రతిరోజూ మా ఇంటి ముందరగానే వెళ్తుంది — ఏమమ్మా దేవకీ! మసాలాదోసె చేస్తావా, లేడీ డాక్టరు వౌతావా అంటే తుర్రున కందిరీగలా పారిపోవడమే!"

ప్రవహించినంతవరకూ భూమిని సస్య శ్యామలం చేసుకుంటూ వెళ్ళే నదీమతల్లిలా మానవుడు నడిచినంత మేరకూ ఆనంద కాంతుల్ని వెదజల్లగలిగితే ఎంత బాగుండును! అది నూటికి కోటికి ఒక్కరి పట్ల మాత్రమే సార్థకమయ్యే మధురమైన వూహ!

నాగరాజును గురించి మిత్ర మండలిలో ఓ ఛలోక్తి వుంది. నాగరాజు ఎక్కడున్నాడని వితర్కించవలసిన అవసరమే లేదట! ఎక్కడైతే సన్నాయి మేళం వినిపిస్తుందో అక్కడ నాగరాజు తప్పకుండా ప్రత్యక్షవౌతాడుట! ఆ మాట నిజమే! పప్పు లేకపోయినా మానె—నాగరాజులాంటి వాళ్ళు ఒక రిద్దరు లేకపోతే వివాహ మహోత్సవాలవల్ల లభించ వలసినంత ఆనందం లభించదేమోనని పిస్తుంది. పెళ్ళిలో నాగరాజు కీపని చేత నౌను ఇది చేతగాదు— అని చెప్పడానికి వీలుండదు. పెట్రమాక్సు లైట్లు ముట్టించడమా! వగ్గాలతో అండాలు దించి గంతల్లోకి గంజిని వార్చడమా! అన్నాలను చాపలమీద ఆరబోయడమా! బంతికి వడ్డించడమా! చేసిన భోజనాలైపోతే— 'ఉండండుండండి బాబూ! ఎసురు సలసల కాగిపోతోంది. బియ్యంవేస్తే అయిదు నిముషాల్లో అన్నమై పోయినట్టే! కొంచెం తాళుకోవాలి' అంటూ ఇంకా భోజనం చేయని వాళ్ళని సముదాయించడమా! అన్ని పనులూ అయిన తర్వాత పెళ్ళి మంటపం ఎదుట మొదటివరుసలో కూర్చుని "ఆడవాళ్ళు అంతరిక్షంలో విమానాలు నడుపుతున్న కాలం! పెళ్ళి కూతుర్ను యిలా సిగ్గు పడగూడదు......" అంటూ సరసోక్తులు విసరడమా!......'ఎవరీ అబ్బాయి మగ పెళ్ళివారి మనిషా? ఆడ పెళ్ళివారి చుట్టమా!' అన్నది తరచుగా పెళ్ళి పందిరి క్రింద ఉద్భవించే సందేహం! నాగరాజును ఒక పక్షానికి చెందిన వాడి క్రింద లెక్కించడం అన్యాయం! అతడు మానవుల కందరికీ సంబంధించినవాడు. వసుధైక కుటుంబంలో ఉండదగినవాడు.

నాగరాజుకు సంబంధించి లోకంలో ఒక ప్రశ్న కూడా కద్దు! అతడు గుణవంతుడు. విద్యావంతుడు. స్ఫురద్రూపి. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. కానీ, అతడి కింకా పెళ్ళి కాలేదు. ఎందుకు కాలేదు?

"నాగరాజుకేమండీ! అమ్మాయి పుట్టి పెరుగుతోంది. ఎవరో కాదు. స్వయానా మేనమామ కూతురు. తలచుకుంటే పెళ్ళి. ఎందుకో తలచుకోడంలేదు, అతను......" అంటూ నాగరాజు

పెళ్ళిని గురించి వెలుగురూ అనుకోడం గూడా ఈనాటి మాటగాదు.

నిజమే! నాగరాజు కెప్పుడో పెళ్ళి కావలిసింది. అతడి వివాహానికి ఒక్క విధి విధానం మాత్రమే ప్రతిబంధకమై నిలిచింది.

నాగరాజు తండ్రి పుట్టడమే రైతు కుటుంబంలోనే పుట్టాడు. కానీ, ఆయన తన అదృష్టాన్ని వ్యవసాయంలోగాక, వ్యాపారంలో పరీక్షించుకో దలచుకున్నాడు. ఆ వ్యాపారం గూడా లారీల పైన భారీ వ్యాపారమే ప్రారంభించాడు. వచ్చే లారీలు వస్తుండగా, వెళ్లేవి వెళ్తుండగా అప్పటి కప్పుడు లాభ నష్టాలు అంతుదేలని ఆ వ్యాపార వృత్తిలో ఆయన పదేళ్ళపాటు ఇంటిని నిత్య కల్యాణం, పచ్చ తోరణం చేశాడు. ఆ పదేళ్ళ చివర ఇంటర్మీడియట్ పరీక్షలు వ్రాసి, ఇంటికి వచ్చిన నాగరాజుకు పట్టెమంచంపైన పడుకుని గాఢాలోచనా నిమగ్నుడైన తండ్రి కనిపించాడు వ్యాపారం మునుపటిలాలా ముమ్మరంగా జరగడం లేదేమని నాగరాజు తల్లిని ప్రశ్నించాడు. వాకబు చేయగా తెలిసిన వివరాలవల్ల కుటుంబానికి తగిలిన దెబ్బ సామాన్యమైనది గాదనీ, ఆ దెబ్బనుంచి ఇక కోలుకోడం దుస్తరమనీ గ్రహించ గలిగాడు నాగరాజు.

వ్యాపారంలో పదేళ్ళుగా వచ్చిన లాభం కుటుంబ ఖర్చులకే దఖలు పడగా, వచ్చిన నష్టం మాత్రం నాలుగంకెల పెద్ద సంఖ్యలో భీకరంగా కనిపిస్తోంది. ఉన్న భూస్థితిలో సగం ముప్పాతిక వంతయినా తెగ నమ్మితేగానీ, అప్పులు తీరవు. అందుకు నాగరాజు పెద్దగా దిగులు పడిపోలేదు. కానీ, కష్టాలు ఒంటరిగా వచ్చాయిగావు. చేజేతులా తాను కుటుంబానికి తెచ్చుకున్న దుష్పరిణామాన్ని గురించి చింతించి, చింతించి నాగరాజు తండ్రి తీరని మనోవ్యాధికి లోనయ్యాడు. ఆ మనోవ్యాధి శారీరకమైన జబ్బులు పెక్కింటికి దారి తీసింది. తండ్రిని అందుబాటులోవున్న వైద్యశాల లన్నింటికీ త్రిప్పించాడు నాగరాజు. పేరెన్నికగన్న డాక్టర్ల కందరికీ చూపించాడు. తండ్రి జబ్బుతో తీసుకున్న ఆ రెండేళ్ళలో నాగరాజు చిక్కి సగమై పోయాడు. కానీ, అతడి శ్రమకు ఫలితం దక్కిందిగాదు. తండ్రి శాశ్వతంగా కళ్ళు మూశాడు.

నాగరాజు కుటుంబం చితికిపోయిందన్న వృత్తాంతం తేట తెల్లంగా లోకులకు తెలిసిపోయింది. మేనమామ తన కూతురును నాగరాజు కివ్వడం లేదు పొమ్మన్నాడు.

గోరుచుట్టుపై ఈ రోకలి పోటువల్ల నాగరాజు హృదయం ఎంతగా గాయపడిందో ఎవ్వరికి తెలుసు? అతడు కష్టాల గరళాన్ని దిగ్రమింగాడు. కానున్నది కాక మానదన్న కృత నిశ్చయంతో సంసార నౌక నౌక సురక్షిత మార్గానికి పట్టించే ప్రయత్నంలో లీనమయ్యాడు.

నాగరాజుకు చేతి కెదిగి వచ్చిన తమ్ముళ్ళిద్దరున్నారు. ఋణపు తిండి తినకుండా వాళ్ళు ప్రయోజకులై ఉద్యోగాల్లోచేరి ఎంతో కొంత సంపాదిస్తున్నారు. నెలసరి ఆదాయంలో ఎంత వరకూ మిగిలించవచ్చునో అంతా మిగిలించి అప్పుల పరిమాణాన్ని అంత కంతకూ తగ్గించుకున్నాడు నాగరాజు.

ఎప్పుడైనా పెళ్ళిని గురించి ప్రస్తావిస్తే, "నా కింకా ఏం పెళ్ళండీ రాజశేఖరంగారూ! పెళ్ళి వయసు మీరిపోతుంది నాకు. తమ్ముళ్ళు ఒక ఇంటి వాళ్ళయితే నా కంతే చాలు! ప్రపంచంలో పుట్టిన వాళ్ళందరూ పెళ్ళి చేసుకుని తీరాలన్న నిర్బంధమేముంది? మానేస్తేనే మంచిదేమో! సంతాన నియంత్రణకు దోహదం చేసినట్టయినా అవుతుంది........" అనేవాడు నాగరాజు.

కానీ నిజాని కది నాగరాజు అంతరంగంలోని ఆంతర్యంకాదు. అతడాదినుంచీ మేనమామ కూతురినే అర్ధాంగిగా భావించాడు. ఆ భావనను త్రోసి రాజని ఇప్పుడా స్థానంలో మరొకరిని నిలుపుకో లేడు. బ్రతక నేర్చివాళ్ళు కొత్త కొత్త మార్పులతో, చేర్పులతో తమ ఆదర్శాలను సవరించుకుంటారు. మరికొందరు బ్రతుకేమైనా ఆదర్శాలకే అంటి పెట్టుకుంటారు. రెండో తరహా మనిషి నాగరాజు.

నాగరాజు కిక పెళ్ళవుతుందా కాదా అన్న సందిగ్ధ పరిస్థితి అలాగే కొనసాగుతుండగా నాలుగైదేళ్ళు నిశ్శబ్దంగా గడిచిపోయాయి.

ఈ చివరినుంచి నాగరాజు ఏ సమస్యకైతే పరిష్కారం సాధించలేకపోయాడో, ఆ సమస్యా పరిష్కారం ఆ చివరనుంచి సాధించబడింది. మేనమామ కూతురు వూరుకున్నంత కాలం వూరుకొని, తండ్రి తీరా ఒక సంబంధాన్ని నిశ్చయించబోతున్నాడనగా 'నేను బావనైతే చేసుకుంటాను. లేదా బావ మయ్యో చూసుకుంటాను' అని నిషధేశుణ్ణి వలచిన వైదర్భిలా తన నిర్ణయాన్ని తేల్చి చెప్పింది.

మేనమామ రాజీకి దిగిరాక తప్పిందిగాదు.

యుక్త వయస్కుడైన ప్రతి యువకుణ్ణీ "ఇంకా వూరుకున్నా వెందుకు బాబూ! నాలుగు నూకలు తలపైన వేసుకోగూడదూ" అంటూ పలకరిస్తుంది లోకం. మాటకేం భాగ్యం! చిటికెలో చెప్పి ముగించవచ్చు. కానీ, కాలం కలిసి రావద్దూ!

* * *

వీధుల్లో విద్యుద్దీపాలు వెలిగేసరికి బస్సు గమ్యస్థానం చేరుకుంది. బస్సుదిగి పట్టణంలో అడుగు పెట్టాను. పట్టణం పట్టణంలా లేదు. సింహగర్జన విన్న తర్వాత కలగుండుపడి సాధు జంతువులు చెల్లాచెదరై పోతున్న అరణ్యంలా, తీరన్ని పర్వతంనుంచి ఓ రాతిగుండు జారిపడి దొర్లి అలలతో దబకలెత్తి పోతున్న సరోవరంలా ఎక్స్‌ప్రెస్ రైలు బండి స్టేషనులో ఆగగానే సందడితో నిండిపోయిన ప్లాట్‌ఫారంలా అన్ని గందరగోళాలకు ఆటపట్టుగావుంది పట్టణం.

అప్పుడా నగరంలో ఉప ఎన్నికలు జరుగుతున్నాయి.

ఎన్నికలు కరువులాంటివైతే ఆ కరువుకు సంభవించిన అధిక మాసంలాంటివి ఉపఎన్నికలు. కరువు తాలూకు అరిష్టాలు అధిక మాసంలో ఎలాగైతే మరింత బాహాటంగా కనిపిస్తాయో, అలాగే ఎన్నికల బీభత్సం ఉపఎన్నికల్లో తారస్థాయిని అందుకుంటుంది. రంగు రంగుల అక్షరాలతో, రకరకాల వాల్ పోస్టర్లతో దిష్టి బొమ్మలకన్నా వికృతంగా కనిపించే గోడలు, మునిగిపోబోతున్నది అచ్చంగా తమ పుట్టే అయినట్టు ఏ రోడ్ల కూడలిలో చూచినా గుంపులు గుంపులుగా చేరి మాట్లాడుకునే మనుషులు. ఉపన్యాసాలకు వచ్చి పుణ్యం గట్టుకోమని గొంతు చించుకునే లౌడ్‌స్పీకర్లు వూరిలో మనుషులకు, వూరిలో వలు గోడలకు, చివరకు ఇళ్ళలోదూరి గడియ వేసుకున్న ఆడవాళ్ళకు రక్షణలేని దినాలు. ఆ నియోజకవర్గంలో ఓటు లేకపోతే మాత్రమే నువ్వు బ్రతికి బయట పడగలవు. ఓటు వుంటే. నీ పాట్లు భగవంతుడే విచారిస్తాడు!

దీపావళి పండుగలప్పుడు రేయింబవళ్ళు నిద్రాహారాలు లేకుండా పని చేసేవి టపాకాయల దుకాణాలు. ఎన్నికల్లో అలాంటివి ముద్రణాలయాలు. తెలిసిన ముద్రణాలయాల కన్నింటికి తిరిగి చూచాను. తెలియడమనగా నగరంలో వాటి ఉనికి గుర్తించి తెలియడ మన్నమాట! దురదృష్టవశాత్తు ప్రెస్ మేనేజర్లతో నాకు పరిచయాలులేవు. వరుసగా నాలుగైదు ప్రెస్సులకు వెళ్ళాను. వెళ్ళినవాణ్ణి వెళ్ళినట్టే తిరిగిరాక తప్పిందిగాదు. పాపం, వాళ్ళుమాత్రం ఏం చేస్తారు! ఆ సందర్భం అలాంటిది. పనిచేసి పెట్టకపోతే మానె, మనసుమ ప్పివ్వి



తంగా ఉంచుకుని నాలుగు మంచి మాటలు చెప్పి పంపగల స్థితిలో వాళ్ళు లేరు.

తెలిసిన ప్రెస్సుల్లో ఇంకా మిగిలి ఉన్నది ఒక్కటి మాత్రమే! ఎట్టి పరిస్థితిలోనైనా శారదా ముద్రణాలయం కష్టమర్లను తోలగ ద్రోసుకోదని ప్రతీతి. ఎనిమిది గంటల సైరను మ్రోగుతుండగా ఆ ప్రెస్సులో ప్రవేశించాను. సింహద్వారం దాటుకోగానే ఆఫీసు రూము. కుర్చీలో వున్న మనిషిని సైతం స్పష్టంగా కనిపించ నివ్వకుండా ఆ గదిలోని టేబిలుపైన దొంతర్లు దొంతర్లుగా పేరుకున్న కాగితాల కట్టలు.

ద్వారం దగ్గర నా నీడ కనిపించిందేమో, కుర్చీలో వున్న మనిషి ఉలికి పడ్డాడు. అంతలో తెప్పరిల్లుకుని "సైకిలు పార్టీ వాళ్ళటండీ?" అన్నాడు.

"అబ్బే, పార్టీల మనిషిని కానండీ! వేరే పనుండి వచ్చాను" అంటూ కుర్చీలో కూర్చున్నాను.

"వెయ్యి నమస్కారాలు బాబూ! ఉన్న పని పూర్తి చేయడానికే వూపిరి పోతుంది మాకు! రేపు సాయంకాలం నాలుగు గంటలకు మూడువేలు కరపత్రాలకు వూచీ పడి ఉన్నాను. కంపోజిటర్లు ఇప్పుడే భోజనాలకు వెళ్ళారు. తిరిగి వస్తే వాళ్ళకు పని అప్పగించి నేను భోజనానికి వెళ్ళొద్దామనుకుంటున్నాను. ఎంత అర్జంటు పని ఉన్నా పదిహేను రోజులు ఓపిక పట్టాలి మీరు......"

"మీరు పదిహేను రోజులంటున్నారు. పదిహేను గంటల తర్వాత నే నీ పనికి వూసుకోవలసిన అవసరమే ఉండదు......"

"బాబ్బాబూ! మీ కింతకంటే చెప్పలేను. ప్రూఫు చేతికొచ్చి అరగంటయింది. కరెక్టు చేస్తున్నాను చూశారూ, ఇంకా చేట భారతమంత మిగిలి వుంది......"

"ఆ పనితో పోల్చి చూస్తే నాది చాలా చిన్న పని. మీరు తలచుకుంటే అరగంటలో ముగించ వచ్చు ..."

"హరేరాం! ఎలా నచ్చచెబుతానండీ మీకు! ఏ ఒట్టుపడితే ఆ ఒట్టు. మీతో మాట్లాడ డానికైనా ఓపికలేదు. నాకు.. ..." మూఢ మానవుల ఎదుట మౌనమే శరణ్య మనుకున్నాడేమో, ఆయన తలవంచుకుని తన పని తాను చేసుక పోసాగాడు.

పది నిమిషాలు అక్కడే కూర్చున్నాను. అలా ఎంతసేపు కూర్చున్నా లాభం లేదనిపించింది. లేచి మెల్లగా బయటికి వచ్చేశాను.

గంట తొమ్మిది కావస్తోంది.

రుసుము చెల్లించుకుంటే హోటళ్ళలో అన్న దానాలు అవ్వారిగా జరిగే వేళ. హోటల్లోకి వెళ్ళి తిన్న శాస్త్రం ముగించాను చెడిన వ్రతం ఎలాగూ చెడింది. మరేదైనా కానుక కొనుక్కోవాలన్నా ఈ పాటికి బజార్లలో అంగళ్ళు కట్టేసి ఉంటారు. హోటలుకు లసతి దూరంలోనే సినిమా థియేటరు. వెళ్ళి కూర్చుంటే కాలమైనా గడుస్తుంది.

థియేటర్లో చిన్ననాడు హైస్కూల్లో కలిసి చదువుకున్న మిత్రు డొకడు కనిపించాడు. అలనాటి బాల్య స్మృతుల్ని, ఇటీవలి జీవితానుభవాల్ని ఏకరువు పెడుతూ, అతడు సినిమా వదిలి పెట్టిన తర్వాత నన్ను తన ఇంటికే తీసుకెళ్ళాడు. అప్పుడిక నిద్రపోవడానికి ప్రయత్నిస్తే ఉదయం ఎనిమిది గంటలకుగానీ నాకు మెలకువ రాకపోవచ్చు. అందు

కల్యాణి కి కిణి

కని ఏదో పుస్తకం చదువుకుంటూ వాలుకుర్చీలో కూర్చున్నాను. ఎంతగా ప్రతిఘటించాలన్నా తెల్లవారుజామున నిద్రా దేవత బారినుంచి తప్పించుకోడం కష్టం. ఎప్పుడు కునుకు పట్టిందో తెలియదు. నిద్ర లేచేసరికి భళ్ళున తెల్లవారిపోయింది.

అరున్నర గంటలకే శుభ ముహూర్తం!

ఆదరా బాదరాగా ముఖం కడుక్కుని వీధిలోకి వచ్చాను. పెళ్ళి జరుగుతున్న సత్రం అక్కడికి అరమైలు దూరంలోవుంది. అల్లంత దూరంలో ఉండగానే నాదస్వరం వినిపించింది. సత్రం ముంగిటకు వెళ్ళి, పచ్చని కొబ్బరి మట్టల పచ్చి తాటి సలు సుస్వాగత మిస్తున్న పందిరిక్రింద నిల్చున్నాను. ద్వారం దాకా కిటకిట లాడిపోతున్న జన సమూహం పైనుంచి లోపలికి చూడ్డానికి ప్రయత్నిస్తున్నాను. అంతలో నాదస్వరం ఆగిపోయింది. మైక్ ముందు ఎవరో గొంతు సవరించుకుంటున్నారు.

ఎదురు చూడని విచిత్ర సంఘటన ఏదైతే వుందో, దాన్ని అద్భుతంగా పేర్కొనవచ్చు. ఆ

"మీలో చక్కని కానుక"
అంది భార్య రామారావు
గారితో.
"ఏమిటది?" అని అడిగాడు
రా. రా. గారు.
"ఒక్క నిముషంలో కట్టు
కొచ్చేస్తాను!" అన్నది ఆయన
భార్య.

ఎ. వి. (మద్రాసు)

నిర్వచనాన్నిబట్టి చూస్తే, ఆ క్షణాన నా కెదురైంది అక్షరాలా అద్భుతమే! మైకులో పద్య పఠనం ప్రారంభమైంది—

"రాగ భరిత మనస్కుడు నాగరాజా
ప్రథిత గుణ గణ విభవాభి రామ—రాధ
మాను తావియు కలిసి పెంపొందినట్లు...."

కళ్ళకు గంతలు గట్టుకున్న గారడీవాడు—వ్రేలితో నిర్దేశించి చూపిన వస్తువుల పేర్లు చెప్పడం అందరికీ తెలిసిన విషయమే! కానీ ఎంతటి గారడీ వాడైనా నా జేబులోని కాగితంలోవున్న పద్యాలను ఎలా చదువ గలుగుతున్నాడు?—జేబులో ఆ కాగితం కోసం వెదికి చూచాను. నా ఆశ్చర్యం ద్విగుణీకృతమైంది. జేబులో ఆ కాగితం ఒక్కటి మాత్రం కనిపించడంలేదు!

జనంలోనుంచి దారి చేసుకుని హాల్లో నాలు గైదు బారల దూరం చొచ్చుకుని వెళ్ళాను.

ఎవరో నా భుజంపైన చేయి వేశారు.

"రాత్రి మా ప్రెస్సు కొచ్చింది మీరే గదండీ! ఏదో పరాకున జేబులోనుంచి కాగితంతీసి టేబిలు పైన ఉంచి, అలాగే మరచిపోయి వెళ్ళిపోయారు. తీరా మీరు వెళ్ళాక ఆ కాగితం తీసి చూద్దును గదా, అది నాగరాజా పెళ్ళికోసం వ్రాయించు కొచ్చిన పద్య రత్నాలు! నాగరాజా కేదైనా పెళ్ళి కానుక ఇద్దామనుకుంటూ, ఈమధ్య వచ్చిపడిన గొడవల్లో ఆ సంగతే మరచిపోయాను. మీ కోరిక, నా ఆశయం ఒక దెబ్బతో వెరవేరే అవకాశం లభించింది. అన్ని పనులూ కొంత సేపలా అట్టే పెట్టమని, ఆ కాగితాన్ని ప్రెస్సు కిచ్చేశాను. అన్యథా భావించరుగదూ!"

"కావలసిన కార్యాన్ని గంధర్వులే తీరిస్తే ఇక అన్యథా భావించడ మెందుకు?" అన్నాను నవ్వుతూ.

లోపలి కొస్తున్న వాళ్ళ కందరికీ చోటిస్తూ నాగరాజా పెళ్ళికోసం పుష్పక విమానంలా తయారైన ఆ హాల్లో ఒకటి రెండు నిమిషాలు నిశ్చలంగా నిల్చున్నాను. రామాయణం కాలంనాటి పుష్పక విమానం చెరనుంచి విముక్తి పొందిన సీతాదేవిని అయోధ్యా నగరానికి తీసుకపోవడానికి ఉపకరించింది. హృదయంలో బంగారు పీట వేసుకుని తన కోసం ఎదురు తెన్నులుచూస్తూ, కాచుకుని కూర్చున్న అమ్మాయిని ఇన్నాళ్ళ కిన్నాళ్ళకు చేబట్ట గలుగుతున్నాడు నాగరాజా. పీటలపైన కూర్చున్న వధూవరులకేసి చూస్తున్న విస్ఫారిత నయనా లన్నింటిలోనూ ఆనందాశ్రువుల చెమ్మదనమే కనిపిస్తోంది.

ఓమూలనుంచి ఎవరో పిలిచారు.

"విన్నేనయ్యా రాజశేఖరం! ఇదిగో—ఇక్కడున్నాను .. .."

ఆయన సచ్చిదానందంగారు!

"ఏమండీ మేష్టారుగారూ! లాసన్నారే! ఎలా వచ్చేశారు?" అంటూ, ఆయనకు దగ్గరగా వెళ్ళాను

"నిన్న సాయంకాలం ఏడు ఏడున్న కల్లా అమ్మాయికి చెమటబట్టి జ్వరం వదిలింది డాక్టరు ఇక పరవాలే దన్నాడు. వెంటనే రోడ్డుపైకి వచ్చేశాను. అప్పటికి బస్సులన్నీ వచ్చేశాయి. ఓ లారీ శర వేగంతో దూసుకోస్తోంది. నిలిపాను. 'ఎక్కించుకోవయ్యా బాబూ! నువ్వెంత కావాలన్నా ముట్టచెబుతాను' అంటే డ్రయివరు ససేమిరా వీల్లే దన్నాడు. 'వీలున్నా, లేకపోయినా నేను లారీలో ఎక్కక తప్పదు. నువ్వు నన్ను తీసుకెళ్ళి పట్టణంలో దిగవిడవక తప్పదు' అంటూ లారీలో కెక్కి కూర్చున్నాను. డ్రయివరు విస్మయపోయి ఇంతకూ అంత అర్జంటు పని ఏమిటి మహాప్రభో అని ప్రశ్నించాడు. వివరాలు చెప్పాను. చెప్పగా తెలిసిందిగదా రా జ శే ఖ రం! ఆ డ్రైవరు గూడా నాగరాజుకు పరిచితుడేనట! ఈ పెళ్ళికి హాజరు కావాలని ఏంధాటిగా విజయవాడనుంచి లారీని కొట్టుకొస్తున్నాడట! అదిగో, ఆ చివర నీలిరంగు చొక్కా తొడుక్కుని కూర్చున్నాడే అతడే లారీ డ్రయివరు అన్వరుస్సేన్......."

ఈసారి పెళ్ళి పీటలపైనుంచి నాగరాజే పలకరించాడు.

"రండి రండి రాజశేఖరంగారూ! ఎప్పుడొచ్చారు? నే నిక్కడ బంధితుడిలా కూర్చున్నా ననుకోండి— అయినా ఎవరెవరు ఎప్పుడొచ్చిందీ గమనిస్తూనే ఉన్నాను. మీరు 'బెటర్ లేట్ దేన్ నెవర్' అన్న సామెత తను సార్థకం చేశారు....."

హోమ ధూమాని కావలి వైపున నాగరాజా పెదవులపైన విరిసిన చిరునవ్వు — సన్నగా జారుతున్న వాన తుంపరలోనుంచి ద్యోతకమయ్యే ఇంద్ర ధనుస్సులా భాసించింది!